క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య 19వ వార్డు అన్న క్యాంటీన్ వద్ద ఉన్న కాలువ పూడికతీత పనులను సోమవారం పరిశీలించారు. అన్ని వార్డుల్లో కూడా డ్రెయిన్ అడుగుభాగం వరకు పూడిక తీయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పొగతోటలోని చెత్త సేకరణను, బ్లాక్ స్పాట్స్‌ను పర్యవేక్షించారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



నెల్లూరు సిటీ : మినీ బైపాస్‌రోడ్డులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఆరుగురు దివ్యాంగులకు సోమవారం ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుడ్డ సంచుల పంపిణీ




నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్, క్రీడాకారులకు సోమవారం గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జి.నారాయణరెడ్డి, మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, వింజం రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని దొడ్ల డెయిరీకి సమీపంలో ఓ మద్యం దుకాణంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బీర్ బాటిల్‌తో కొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై సోమవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ ఇంటర్‌నెట్ సర్వీస్‌లో పనిచేస్తున్న ప్రవీణ్‌బాబు ఆదివారం రాత్రి దొడ్ల డెయిరీకి సమీపంలోని ఓ వైన్‌షాపులో మద్యం సేవించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రవీణ్ స్నేహితులైన కాగులపాడుకు చెందిన అవినాష్ మరో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించేందుకు వచ్చారు. వీరికి సమీపంలో నెల్లూరు నగరానికి చెందిన ఐదుగురు యువకులు కూడా మద్యం సేవిస్తున్నారు. ప్రవీణ్ వర్గం సరదాగా మాట్లాడుకుంటూ పక్కన ఉండే నెల్లూరుకు చెందిన యువకులపై పడ్డారు. మాపైనే పడతారా అంటూ వారు ప్రవీణ్ తలపై బీర్ బాటిల్‌తో కొట్టారు. ఈ క్రమంలో అతని స్నేహితుడైన అవినాష్ చేతికి కూడా గాయమైంది. దాడి అనంతరం వారు అక్కడి నుంచి పారిపోయారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పాల్గొన్న సభ్యులు

నెల్లూరు సిటీ : త్రైత సిద్ధాంత భగవద్గీతపై రూరల్ మండలంలోని దేవరపాళెం, కొండ్లపూడి, కొండ్లపూడి సంఘం, పొట్టేపాళెం గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. డి.సురమౌళి, సురేష్, కోటేశ్వరరావు, అన్నపూర్ణ, రామయ్య, కొండమ్మ, విజయమ్మ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై స్వామివారు



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల వారి అవతార ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, అశ్వవాహన ఉత్సవం, రాత్రి పేట ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వరద వెంకటశేషయ్య వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కూల్‌గా దోపిడీ

- ఎస్ఎంసీలో ఏసీల కుంభకోణం
- పెద్ద ఎత్తున నిధుల స్వాహా
- కాంట్రాక్టర్ నుంచి సొమ్ము రికవరీకి ఆదేశాలు



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోతోంది. తాజాగా ఏసీల కుంభకోణం వెలుగు చూసింది. గతేడాది జూలై నెలలో ఏసీలు బిగించే వర్క్ ఆర్డర్ ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ శ్రీసాయి హనుమాన్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా అదే నెలలో ఏసీలను సరఫరా చేసి పలు విభాగాల్లో బిగించినట్లు బిల్లులు తయారు చేసి ఎస్ఎంసీ కార్యాలయానికి నివేదించగా వెంటనే మంజూరు కూడా చేశారు.

రూ.6 లక్షలకు బిల్లులు

వాస్తవానికి ఏసీలు కొనుగోలు చేసిన తర్వాత సదరు కాంట్రాక్టర్ ఎస్ఎంసీలోని ఏ విభాగంలో వాటిని బిగిస్తారో సంబంధిత సూపరింటెండెంట్ వద్ద సంతకాలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇక్కడ ఏసీలు బిగించకుండానే బిగించినట్లుగా ఆయా విభాగాల అధికారుల వద్ద సంతకాలు పెట్టించుకున్నారు. ఇలా వాటిని పరిశీలించిన ఎగ్జామినర్ కూడా సరిగ్గా ఉన్నాయని ఆ బిల్లులపై సంతకాలు చేసి అకౌంట్ సెక్షన్‌కు పంపించడం, నిధులు మంజూరు చేయడం జరిగిపోయింది. ఇలా రూ.6,32,928ల బిల్లును పెట్టుకున్నారు. ఈ తతంగమంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది.

తక్కువ ధరకు కొని అధిక రేట్లుగా చూపించి

ఈ వ్యవహారం కొద్దిరోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఎస్ఎంసీలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు ఏసీల బాగోతంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అవినీతిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు ఏసీల కొనుగోలుపై పూర్తిస్థాయిలో విచారణ జరపగా మొత్తం ఆరు ఏసీలను సెప్టెంబర్ నెలలో బిగించినట్లు తేలింది. అది కూడా వన్ టన్ కెపాసిటీ ఉన్న ఏసీని బిగించి టు టన్ కెపాసిటీ ఏసీని బిగించినట్లు సదరు కాంట్రాక్టర్ జూలైలోనే బిల్లులు సమర్పించి నిధులు మంజూరు చేయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. రూ.25 వేలు, రూ.30 వేలు విలువ చేసే ఒక్కో ఏసీలకు అధిక రేట్లను బిల్లులో చూపించి భారీగా దోపిడీకి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఏసీల కొనుగోలు విషయంలో పొరపాటు జరిగిందని, కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారించి సదరు కాంట్రాక్టర్‌కు ఇకపై ఎలాంటి వర్క్ ఇవ్వకూడదని, పైగా అతని వద్ద నుంచి రూ.1,20,156 తక్షణమే రికవరీ చేయాలని ఎస్ఎంసీ ఉన్నతాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వును ఎస్ఎంసీ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులకు పంపించారు.

‘మనమిత్ర’ను సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ నందన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ‘మనమిత్ర’ వాట్సాప్ ఆధారిత చాట్‌బాట్ ద్వారా మున్సిపల్ సేవలను సులభతరంగా పొందవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేలా ‘పురమిత్ర’ యాప్ ద్వారా స్థానిక సమస్యలను అప్లోడ్ చేసి పరిష్కారం పొందవచ్చని వివరించారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా పరిష్కారం అందించాలని ఆదేశించారు. కాగా మొత్తం 53 ఫిర్యాదులు రాగా అందులో ఇంజినీరింగ్- 5, హౌసింగ్- 25, టౌన్ ప్లానింగ్- 4, రెవెన్యూ- 3, పబ్లిక్ హెల్త్- 1, ఆప్కాస్- 9, అకౌంట్ సెక్షన్- 3, అడ్మినిస్ట్రేషన్- 3 ఉన్నాయన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన జిల్లా నేతలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో నెల్లూరు రూరల్ నుంచి రావు శ్రీనివాసరావు, అబ్దుల్‌సలీమ్, కోవూరు నుంచి బట్టేపాటి నరేంద్రరెడ్డి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్వేపల్లి నుంచి నెల్లూరు శివప్రసాద్, నెల్లూరు నగరం నుంచి నేతాజి సుబ్బారెడ్డి, గూడూరు నుంచి కొడవలూరు భక్తవత్సల రెడ్డి, కందుకూరు నుంచి ముప్పవరపు కిశోర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత



వెంకటాచలం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన గుడ్లూరువారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల నలుగురు విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ హస్తి లక్ష్మణరాజు రూ.6 వేల నగదు ప్రోత్సాహాలను అందజేశారు. సోమవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ రమణ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన లక్ష్మణరాజు విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పిల్లలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఆర్జేడీ పద్మను కలిసిన జేఏసీ నేతలు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ కల్లూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గుంటూరులో ఇంటర్ విద్య జోన్-3 ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథం పద్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టనున్న రేషనలైజేషన్, బదిలీల్లో అధ్యాపకులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెగ్యులరైజేషన్, రెన్యూవల్, గతేడాది మే నెల కాలానికి పెండింగ్ జీతాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సైదులు, జాయింట్ సెక్రటరీ వీరయ్య పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజును సస్పెండ్ చేయాలి

- సీపీఎం నాయకుల నిరసన



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేయడాన్ని ప్రశ్నించిన శ్రీనివాసరావుపై రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం సాయంత్రం సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి పూలే సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ అహంకార పూరితంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పుల్లయ్య, రెహానా బేగం, జిల్లా కమిటీ సభ్యులు కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, అజీజ్, పెంచలయ్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్-పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు నలమూరు చంద్రశేఖర్‌రెడ్డిని రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, నాయకులు కె.శివశంకర్‌రెడ్డి, కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, జనార్దన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మెట్టుకూరు సుబ్బారెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘ఇస్కాన్’లో వేసవి శిక్షణా శిబిరం



నెల్లూరు(బృందావనం) : మినీ బైపాస్‌రోడ్డు దగ్గర ఉన్న ‘ఇస్కాన్’ మందిరంలో వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిర మేనేజర్ రాజశేఖర్ దాస్ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు సమ్మర్ క్యాంప్ ఉంటుందన్నారు.

చిన్నారులకు అభినందన



నెల్లూరురూరల్ : నూజివీడులో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు క్రీడాపోటీలు జరగ్గా, ఇందులో జిల్లా విద్యార్థులు మూడు గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో వీరికి కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్ సోమవారం అభినందనలు తెలిపారు.

కుళాయి పన్నులను వసూలు చేయండి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో కుళాయి పన్నులను విధిగా వసూలు చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను కమిషనర్ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా ఇంజినీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాలతో కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ పరిధిలోని తాగునీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ వీధిదీపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్ షెల్టర్లను క్రమం తప్పకుండా గమనిస్తూ, దుర్వినియోగం కాకుండా పూర్తి బాధ్యతలతో పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, సూపరింటెండెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలువాయి తహసీల్దార్‌పై విచారణ జరపాలి

నెల్లూరు(అర్బన్) : కలువాయి తహసీల్దార్ అవినీతి, అక్రమాలపై కలెక్టర్ విచారణ జరపాలని మండల జనసేన అధ్యక్షుడు పెరంకొండ మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు కార్యకర్తలతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డీకేడబ్ల్యూలో అభివృద్ధి కార్యక్రమాలు



కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సంస్థ బృందం

నెల్లూరు (టౌన్) : కోరమండల్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రూ.13 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు సంస్థ కడప జోన్ మార్కెటింగ్ హెడ్ టి.చక్రధర్ తెలిపారు. ఈ క్రమంలో రూ.6 లక్షలతో చేపట్టిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సంస్థ బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చి రూ.4.30 లక్షల విలువ చేసే కుట్టు మెషీన్లను అందజేసినట్లు చెప్పారు. ఆక్వా రంగంలో విద్యార్థులు కొత్తరకం ఫుడ్‌లను తయారు చేసే విధంగా రూ.3 లక్షల విలువతో కూడిన అక్వాపాప్ (స్టార్టప్ ల్యాబ్)ను ఏర్పాటు చేసి పరికరాలను అందజేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డీకేడబ్ల్యూ కళాశాలలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ కడప జోన్ హెచ్‌ఆర్ సౌజన్య, ఇక్క ఫౌండేషన్ డైరెక్టర్ కిశోర్, కళాశాల ప్రిన్సిపల్ గిరి, కోఆర్డినేటర్ రంజని పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని నాలుగో డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో డివిజన్ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా సంధాని, కో-ఆర్డినేటర్‌గా మధుసూదన్‌ను ప్రకటించారు. అనంతరం పర్వతరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు సిటీలో అందరూ సమష్టిగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా దగా చేసిందన్నారు. టీడీపీ చేతిలో మోసపోయామని, జగన్ మోహన్‌రెడ్డి లాంటి నాయకుడిని ఎందుకు వదులుకున్నామా అని ఆలోచించే పరిస్థితిలోకి ప్రజలు వచ్చారన్నారు. ఈ సమయంలో డివిజన్‌లోని ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించుకుంటూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజాహుస్సేని, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మేధావుల ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి నేతాజి సుబ్బారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిద్ధిక్, డివిజన్ ఇన్‌చార్జిలు జయరామిరెడ్డి, మహేష్, గిరిరెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు నాగమ్మ, అభిషేక్‌రెడ్డి, మస్తాన్, యస్దాని, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సంతపేట మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచండి



పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని సంతపేట మార్కెట్ ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన సంతపేట, రైల్వే ఫీడర్స్ రోడ్డు, చింతారెడ్డిపాళెం పరిసర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. రైల్వే ఫీడర్స్ రోడ్డు ప్రాంతంలో గోడలపై అంటించిన పోస్టర్లను వెంటనే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగర వ్యాప్తంగా ప్రణాళికాబద్ధమైన పారిశుద్ధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేయాలన్నారు. అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 42వ డివిజన్ మైనార్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను సోమవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై, 110 మంది విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. స్థానిక కార్పొరేటర్ కరిముల్లా, పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేని, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, మేధావుల ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిద్దిక్, ముస్లిం సంచార జాతుల విభాగం అధ్యక్షుడు బాబా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌పీ కార్యవర్గ ఎన్నిక



ఎంపికైన నూతన కార్యవర్గం

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ఏపీఎన్జీఓ కార్యాలయంలో రాష్ట్ర మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఇందులో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా భానుమహేష్, కార్యదర్శిగా రిబాక, వైస్ ప్రెసిడెంట్‌గా సుగుణ, జాయింట్ సెక్రటరీగా అనూష, జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఆదిల్, కోశాధికారిగా అనూష, కో-ట్రెజరర్‌గా నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జ్యోతి, సుమాంజలి, హెప్సిబా, నవీన్, హనుమానాయక్, మాబ్‌జాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి ఆర్థిక సాయం



నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు పోలమ్మ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బీమ్ వర్కర్స్ యూనియన్ తరఫున సంఘ ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ సూచనతో సాటి పారిశుద్ధ్య కార్మికులు సోమవారం పోలమ్మకు ఆమె నివాసంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుమతి, యాలమ్మ, స్వరూప, విజయమ్మ పాల్గొన్నారు.